క్లుప్తంగా

వితరణ



వృద్ధాశ్రమానికి కూలర్లు అందజేస్తున్న దాతలు

విజయనగరం: వృద్ధాశ్రమానికి ఎన్ఆర్ఐలు అందించిన సహాయం వెలకట్టలేనిదని విజయనగరం పట్టణంలోని వెంకటసాయి వృద్ధాశ్రమ నిర్వాహకుడు కట్టమూరి ఆంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఉన్న వెంకటసాయి వృద్ధాశ్రమానికి ఎన్ఆర్ఐలు వాణి, ఉదయ్, తదితర మిత్రబృందం సమకూర్చిన ఐదు కూలర్లు, రెండు మినరల్ వాటర్‌ప్లాంట్లలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ..ఉద్యోగరిత్యా అమెరికాలో ఉన్నప్పటికీ పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మర్చిపోకుండా ఇక్కడి వృద్ధాశ్రమానికి ఆరు నెలలకు సరిపడేలా నిత్యావసర సరుకులు, కూలర్లు, మినరల్ వాటర్ ప్లాంట్‌లను సమకూర్చిన విద్యార్థుల ఉన్నత భావాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు దంపతులతో పాటు వాసవీ క్లబ్ ప్రతినిధులు మండవిల్లి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరానికి స్పందన



దేశభక్తి గీతాలాపన చేయిస్తున్న శిక్షకులు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ కార్యదర్శి లక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ.. చిట్టిబాబు మాస్టర్ ఆధ్వర్యంలో దేశభక్తి గేయాలు.. తమ్మిన షణ్ముఖ ప్రియ నేతృత్వంలో సంగీతం, నృత్యం నేర్పించారు. సుమారు 40 మందికి పైగా చిన్నారులు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో షేక్ గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక సర్గ హవనం చేసి పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం వెండి మంటపంలో సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్, రామగోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



సూచనలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: పదో తరగతి(టెన్త్) ఫెయిలైన విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన తరగతులను ఎంఈవో త్రినాథరావు తనిఖీ చేసి, విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా చూడాలని, త్వరలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా చదివించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు జి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో విత్తనగుళికల తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణలు విత్తనగుళికల తయారీని ప్రయోగపూర్వకంగా వివరించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. అనుములు, కందులు, మినుములు, పెసలు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు, అలసందలు వంటి పలురకాల విత్తనాలను విత్తనగుళికలుగా తయారు చేసుకుని, నాటుకోవాలని అలా అయితే తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడులు ఇచ్చే పంట సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈతతో ప్రయోజనాలెన్నో..!

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్
- స్విమ్మింగ్ పూల్‌లో గడుపుతున్న చిన్నారులు, పెద్దలు



ఈత సాధన చేస్తున్న చిన్నారులు

విజయనగరం: వేసవి సెలవుల నేపథ్యంలో ఈత కొలనుల వైపు యువత, చిన్నారులు, పెద్దలు చూస్తున్నారు. ఆరోగ్యం.. ఆనందం.. ఉత్తేజానికి ఈత దోహదం చేస్తుంది. అలాగే ఈతలో రాణిస్తే ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి. విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గల స్విమ్మింగ్ పూల్‌ను లీజ్ ప్రాతిపదికన థర్డ్‌పార్టీ నిర్వహిస్తోంది. అంతేకాకుండా శివారు ప్రాంతాలతో పాటు విజయనగరం మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ ఈత కొలనులు కూడా ఉన్నాయి. కొలనుల వద్ద శిక్షకులు ఉండి శిక్షణ ఇస్తున్నారు.

అనేక ప్రయోజనాలు

పిల్లలకు ఈత ఒక క్రీడ అయితే.. పెద్దలకు అది ఆరోగ్య సంజీవని. రోజులో కనీసం 30 నుంచి 40 నిమిషాల పాటు ఈత కొడితే ఎన్నో రకాల వ్యాధుల నుంచి బయటపడవచ్చు. ముఖ్యంగా ఊబకాయం సమస్య ఉండదు. మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారికి ఈత మేలు చేస్తుంది. ఊహించని నీటి విపత్తులు ఎదురైనప్పుడు తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులకు సాయం చేసేందుకు ఈత దోహద పడుతుంది.

ఎన్నో అవకాశాలు

స్విమ్మింగ్‌ను ఒక క్రీడగా ఎంచుకుని రాణించే వారికి ఎన్నో అవకాశాలున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏటా ఈత పోటీలను నిర్వహిస్తుంది. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) కూడా అంతర్జాతీయ పోటీలకు పిల్లల్ని తీసుకెళ్లేలా తీర్చిదిద్దుతుంది. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లాంటి పోటీల్లోనూ ఈత క్రీడకు చోటుండడంతో అంతర్జాతీయంగా రాణించే అవకాశం ఉంది. ఈతలో సత్తాచాటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వీరు శారీరకంగా, మానసికంగా ఎంతో దృఢంగా ఉంటారు.

పర్యవేక్షణ.. జాగ్రత్తలు ముఖ్యం..

- సాధారణంగా కొలను 3 నుంచి 10/12 అడుగుల లోతు ఉంటుంది. పిల్లల భద్రత దృష్ట్యా లైఫ్ జాకెట్లు తొడిగించి కొలనులో దించాలి.
- ఐదేళ్లు పైబడితేనే ఈత అలవాటు చేయాలి. వీరికి ప్రధానంగా తమను తాము నీటిలో రక్షించుకునే అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- నెల నుంచి 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకునే సరికి నీటిలో ప్రమాదాల నుంచి బయటపడేలా చిన్నారులు మారుతారు. అదే అలవాటుగా చేసుకున్న వారైతే ఎన్నో రకాల జల క్రీడల వైపు అడుగులేసే అవకాశం ఉంది.
- బాలురు నైలాన్ షర్ట్, తలకు క్యాప్, స్విమ్మింగ్ కళ్లజోడుతో ఈతకు దిగాలి. అదే బాలికలకు ప్రత్యేకంగా స్విమ్ సూట్లు మార్కెట్లో ఉన్నాయి.
- కొలనులో దిగే ముందు.. ఈత తర్వాత కచ్చితంగా స్నానం చేయాలి.
- సామర్థ్యానికి మించి ఎక్కువమంది ఒకేసారి ఈతకు దిగడం మంచిది కాదు. 25/15 మీటర్ల విస్తీర్ణంలో కొలను ఉంటే గరిష్ఠంగా ఒక విడతలో 40 మందికి మించి ఈత కొట్టకూడదు.

ఈత మంచి క్రీడ..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి క్రీడకూ మంచి ఆదరణ లభిస్తోంది. ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో ఈతకు మంచి ప్రాధాన్యత ఉంది. ఈ క్రీడలో రాణించే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటారు. కేవలం చిన్నారులే కాకుండా పెద్ద వయస్సు గల వారు ఆచరించడం మంచిది.

– శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు.

ఎమ్మెల్సీ వితరణ..



మేఘనకు రూ.10 వేల చెక్ అందిస్తున్న ఎమ్మెల్సీ



నిరుపేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మానవత్వం చాటుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు తన వంతుగా రూ.80 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌లు, నగదు అందజేసి తన సేవా నిరతిని చాటుకున్నారు. సురేష్‌బాబు సతీమణి స్వర్గీయ పెనుమత్స రోజారాణి జయంతిని పురస్కరించుకుని మొయిద గ్రామంలోని తన నివాసంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రోజారాణి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులైన గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన హిమవర్షిణి, జరజాపుపేటకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి హారికకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అలాగే మొయిద గ్రామానికి చెందిన పేద విద్యార్థి అల్లాడ మేఘన చదువు నిమిత్తం రూ.10 వేల చెక్ అందజేశారు. ప్రతి నెలా తన జీతంలో సగభాగం సేవా కార్యక్రమాలకే ఎమ్మెల్సీ కేటాయిస్తున్నారు. ఇటీవల జరజాపుపేటలో ఓ యువకుడు మృతి చెందగా నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.లక్ష నగదు అందజేశారు. తాజాగా పేద విద్యార్థులకు సహాయాన్ని అందించి మంచి మనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సేవలోనే నిజమైన సంతృప్తి దాగి ఉందన్నారు. ఉన్నంతలో నిరుపేద విద్యార్థులకు సహాయపడితే వారు ప్రయోజకులుగా మారే అవకాశం ఉందన్నారు. ఆర్థిక స్థోమత లేక ఎంతో మంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని.. అటువంటి వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెఆప్పరు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ పి. త్రినాథరావు ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఒకరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: తక్కువ ప్రాపర్టీ చూపించి ఎక్కువ లోన్ తీసుకుని బ్యాంక్‌ను మోసం చేసిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలం గరిడకు చెందిన బాలచందర్ యూకో బ్యాంక్ నుంచి రూ. 34 లక్షల లోన్ తీసుకున్నాడు. అయితే చాలా తక్కువ విలువ కలిగిన ఆస్తిని తనఖా పెట్టి రుణం తీసుకోవడంతో పాటు సక్రమంగా చెల్లించలేదు. దీంతో బ్యాంక్ సిబ్బంది ఆడిట్ నిర్వహించగా.. బాలచందర్ చేసిన మోసం బయటపడింది. వెంటనే బ్యాంక్ సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు.

తరిమినా.. మళ్లీ అక్కడకే..









విజయనగరం జిల్లా కేంద్రంలో నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద ఓ వైపు విద్యార్థులు సందడిగా కనిపించగా.. మరోవైపు పశువులు, మూగజీవాలు దర్శనమిచ్చాయి. పరీక్ష కేంద్రంలోకి ఆవులు, మేకలు, కుక్కలు వెళ్లడానికి ప్రయత్నించగా.. సిబ్బంది, పోలీసులు వాటిని తరిమారు. అయినప్పటికీ అవి మళ్లీ పరీక్ష కేంద్రం వద్దకే చేరుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

స్వచ్ఛ భోగాపురానికి శ్రీకారం..



స్వచ్ఛ భోగాపురానికి గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని కోనేరు చుట్టూ ఉన్న గట్టును వాకింగ్ ట్రాక్‌గా మార్చాలనే సంకల్పంతో పంచాయతీ అధికారులు, కార్మికుల సహకారంతో కోనేరును శుభ్రపరిచారు. కోనేరు ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఇకపై ప్రతి ఆదివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని, స్థానికులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

– భోగాపురం

రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం..

- డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి అన్నారు. రోగులకు సేవలు అందించడంలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులు వెనుకబడ్డాయనే అంశంపై 'సేవల్లో వెనుకబడిన ఏపీవీపీ ఆస్పత్రులు' శీర్షికన సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బి గ్రేడ్‌లో ఉన్న ఆస్పత్రులను ఏ గ్రేడ్‌లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇద్దరు వైద్యులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ కొరకు కార్యాలయంలో డిప్యూటేషన్‌పై నియమించినట్లు చెప్పారు. వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీ పక్రియ కొరకు ఒక వైద్యుడిని నియమించామని, ఆ పక్రియ పూర్తవ్వగానే వైద్యుడిని రిలీవ్ చేస్తామని తెలిపారు. అదేవిధంగా సదరం రీ అసెస్‌మెంట్ కొరకు ఒక వైద్యురాలిని నియమించినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

- ఏపీ ఎన్‌జీఓ భోగాపురం తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు



కొమ్మూరు దుర్గారావు

పూసపాటిరేగ/భోగాపురం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌పై మానవత్వంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీఓ భోగాపురం తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ డిమాండ్స్ న్యాయపరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వరిస్తున్నా వీరికి ప్రత్యేక జాబ్ చార్ట్ లేదన్నారు. 23 శాతం జీతం పెంచడంతో పాటు హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల అద్దె బకాయిలు విడుదల చేయాలని కోరారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాతలతో నిర్వాహకులు

విజయనగరం టౌన్: వేసవిలో రక్తనిల్వల కొరత ఉంటుందని.. రోగులకు సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ప్రముఖ ప్లాస్టిక్ అండ్ కాస్మోటిక్ వైద్య నిపుణురాలు ఎం.శ్రావణి అన్నారు. మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రవాదుల దాడుల్లో అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ స్థానిక ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం సామాజిక బాధ్యతని మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం రక్తదాన విభాగం అధ్యక్షుడు మహేశ్వర తెలిపారు. సుమారు 20 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మౌళి, సూరిబాబు, లత, మూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఏటీ అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సంతోష్‌కుమార్‌కు ఉద్యోగోన్నతి లభించింది. గ్రేడ్–5 నుంచి గ్రేడ్–4 కార్యదర్శిగా ప్రమోషన్ కల్పిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు భోగాపురం మండలంలోని రాజాపులోవ పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ శంకర్ జగన్నాథ్, తదితరులు సంతోష్‌కుమార్‌ను అభినందించారు.

ఘనంగా దాడితల్లి ఉత్సవాలు ప్రారంభం



దేశమ్మతల్లికి భక్తుల పూజలు



అమ్మవారి చెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా పేరొందిన దాడితల్లి ఉత్సవాలు స్థానిక పట్టణంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉత్సవాలు ముందురోజు దేశమ్మతల్లి వారాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న దేశమ్మకు భక్తులు పసుపు, కుంకుమ, చీరలు, కోళ్ల సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గొల్లపల్లిలో కొలువైన దాడితల్లికి సుప్రభాత సేవ, ప్రత్యేకపూజలు చేసి, ఉత్సవాలను ఆరంభించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవంతో పండగ ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దైవదర్శనం సులభంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ జి.భవ్యరెడ్డి, సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్ఐ రమేష్‌లు మొత్తం 250 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయించారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరిగేలా చూడాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.